క్లుప్తంగా

ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు

కందుకూరు: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పండుగ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వాడవాడలా చలువ పందిళ్లతో, ప్రతి ఇంటిలోకి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చే వినాయక చవితి పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, నవరాత్రులను భక్తిశ్రద్ధలతో ఆచరించాలని ఆయన ఆకాంక్షించారు.

కనిగిరి రూరల్: ప్రజలకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గణ నాథుని ఆశీస్సులు, అనుగ్రహంతో తలపెట్టిన కార్యాల్లో అందరికీ మంచి జరగాలని, విఘ్నేశ్వరుని కృపతో ప్రతి ఒక్కరి విఘ్నాలు తొలగి మంచి జరగాలని ఆకాంక్షించారు. అలాగే పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్ని) వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వినాయకచవితి వేడుకలు, నిమజ్జనాలు నిర్వహించుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న ఈఓ, భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా నారాయణస్వామి ఉత్సవమూర్తిని రథపై నుంచి మేళతాళాల నడుమ రథోత్సవం నిర్వహించారు. ఉదయం మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించి అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.రమణారెడ్డి, ఆలయ కమిటీ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా వినాయకచవితి పూజా సామగ్రి అమ్మకాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు, పూజా సామగ్రి

సింగరాయకొండ: వినాయకచవితి పూజలకు మండల ప్రజలు ఆదివారం పెద్ద ఎత్తున పూజా సామగ్రి కొనుగోలు చేశారు. మండలంలో మండపాలు కట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటివరకు 64 మంది అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ సెంటరులో పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రజలు పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి భారీగా రావడంతో రద్దీ ఏర్పడింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని మినీబైపాస్‌రోడ్డులో గల పతంజలి షాపు వారు మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందజేశారు.

సముద్ర తీరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పాకలలో చెల్లెమ్మగారిపట్టపుపాలెం సముద్ర తీరాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: సముద్రతీరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల మత్స్యశాఖ అధికారి ఎస్‌వీఎస్ వర్షిణి సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ చెల్లెమ్మగారి పట్టపుపాలెం సముద్రతీరంలో ఆదివారం స్వచ్ఛ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌వీఎస్ వర్షిణి మాట్లాడుతూ తీరప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మత్స్యకారులదని, తీరం పరిశుభ్రంగా ఉంటే చేపల ఉత్పత్తి బాగా జరిగే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, సైంటిస్ట్ చంద్రశేఖర్, నాయుడు ఈశ్వరరావు, గొల్లపోతు గోవర్ధన్, వాయిల జాలరామయ్య, ప్రసన్నకుమార్, కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జై..జై గణపయ్య

- ఉత్సవాలకు సిద్ధమైన గణపతులు

కనిగిరి రూరల్: వినాయక చవితి పండుగకు గణనాథుడి విగ్రహాలు సిద్ధమయ్యాయి. పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు వినాయకుని ప్రతిమలను భారీగా తరలించారు. రూ.2 లక్షల విలువైన విగ్రహాలను సైతం ఈ ఏడాది అమ్మకాలుచేశారు. పట్టణంలోని ప్రతి వీధిలో, ప్రతి గ్రామంలో గణేష్ విగ్రహం ఏర్పాటు చేయనుండటంతో గణేశుని ప్రతిమల కొనుగోళ్లతో సందడి నెలకొంది. పట్టణంలోని వాల్మీకి వీధిలో అత్యంత భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. విగ్రహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కనిగిరి పోలీస్ డివిజన్ పరిధిలోని మూడు సర్కిల్‌లు 9 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం వరకు సుమారు 270 వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి పొందినట్లు డీఎస్పీ రత్నాకర రామరాజు తెలిపారు. ఒక్క కనిగిరి మున్సిపాలిటీ, మండలంలోనే సుమారు 120 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

కొనుగోళ్లతో సందడి..

గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని పట్టణంలో ఆదివారం రాత్రి వ్యాపారుల సందడి నెలకొంది. ఇప్పటికే కొన్ని గ్రామాలకు విగ్రహాలు తరలి వెళ్లగా, ఆదివారం ఎక్కువశాతం విగ్రహాలను తరలించారు. విగ్రహాలను తరలించేటప్పుడు యువకులు గణపతి బొప్పా మోరియా నినాదాలతో హోరెత్తించారు. బొడ్డుచావిడి సెంటర్‌లో వినాయక మట్టి విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. పెదారికట్ల, చినారికట్ల గ్రామాల నుంచి మట్టి ప్రతిమలను తెచ్చారు. మట్టి వినాయకుని ప్రతిమ, పత్రి (అన్నిరకాల ఆకులు) కలిపి రూ.100 నుంచి రూ.120 వరకు అమ్ముతున్నారు. పూజ సామగ్రి, పండ్లు, ఇతర ధరలు మంచి రేటు పలుకుతున్నాయి.

హనుమంతునిపాడు: మండలంలో ఈ ఏడాది వినాయకుని విగ్రహాలు భారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం నాటికి గ్రామాల్లో గణేష్‌ని విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు పోలీసు స్టేషన్ నుంచి 30 మంది పైబడి అనుమతి తీసుకున్నట్లు ఎస్సై శివనాగరాజు తెలిపారు. ఒంగోలు, పొదిలి, కనిగిరి, మార్కాపురం పట్టణాల నుంచి విగ్రహాలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. విగ్రహ కమిటీ సభ్యులు అన్ని జాగ్రత్తలుతీసుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎస్సై సూచించారు.

పాకల బీచ్‌లో నిమజ్జనానికి ఏర్పాట్లు

సింగరాయకొండ: పాకల బీచ్‌లో వినాయక నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. వినాయక నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ రంగనాథ్ మాట్లాడుతూ పాకలబీచ్‌లో ఈ సంవత్సరం వినాయక విగ్రహాలు భారీగా నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్నారు. మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి కూడా విగ్రహాలు భారీగా వచ్చే అవకాశం ఉందన్నారు. విగ్రహాలతో పాటు బీచ్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎస్సై టి.శ్రీరామ్, మత్స్యకార నాయకుడు గొల్లపోతు గోవర్ధన్, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : ఎస్సై రాజారావు

పొన్నలూరు: మండల పరిధిలోని గ్రామాల్లో వినాయకచవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న గణపతి విగ్రహాలు, మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మండల ఎస్సై దాసరి రాజారావు కోరారు. గణపతి విగ్రహ కమిటీలలో కనీసం ఐదుగురికి తగ్గకుండా సభ్యులుండి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు, చిరునామా వివరాలు తెలియజేయాలన్నారు. విగ్రహం నిమజ్జనం తేదీ, ప్రదేశం, విగ్రహం తీసుకెళ్లే మార్గం, నిమజ్జనానికి వాడే వాహనం వివరాలు తెలపాలన్నారు. ఉత్సవ కమిటీలో, ఊరేగింపుల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టించడం, బాణసంచా వంటి పేలుడు పదార్థాలు వాడటం చేయరాదన్నారు. వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రార్థనా మందిరాలకు వెళ్లే రహదారుల్లో విగ్రహాలు ఏర్పాటు చేయకూడదన్నారు. విగ్రహం మండపాలకు కరెంట్ సరఫరా వివరాలు తెలపాలన్నారు. కరెంట్ సరఫరాకు విద్యుత్‌శాఖ అనుమతులుగానీ, పక్కనే ఉండే గృహాల నుంచి తీసుకుంటున్నారా అనే వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసి నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీసీపల్లి: మండలంలో గణేష్ మండపాల నిర్వహణ పూర్తి బాధ్యత కమిటీ నిర్వాహకులదేనని ఎస్సై మాధవరావు తెలిపారు. మండపాల వద్ద ఎటువంటి చెదురు మదురు సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద మైక్ సెట్లను రాత్రి 10 లోగా నిలిపివేయాలన్నారు. మండపాల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు, మత ఘర్షణలు తలెత్తే కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు పోలీస్ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఉలవపాడు: పూజలందుకోవడానికి విఘ్నేశ్వరుడు వివిధ గ్రామాలకు బయలుదేరాడు. చాగల్లు గ్రామం నుండి వివిధ ప్రాంతాలకు కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలు బయలుదేరాయి. ట్రాక్టర్లు, ఆటోలు, లారీలలో వచ్చి వినాయక విగ్రహాలను క్రేన్ లతో పెట్టి తరలించారు. గణపతిబప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ రంగులు కొట్టుకుంటూ ఊరేగింపుగా విగ్రహాలను తరలించారు.

వలేటివారిపాలెం: వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వినాయక చవితి పండుగను జరుపుకోవాలని ఆయన సూచించారు.



తరలించేందుకు సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమ



పాకల బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రంగనాథ్

పోలీస్ నిబంధనలు పాటించాలి



గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు విధిగా పోలీస్ నిబంధనలు పాటించాలి. పోలీస్ అనుమతితోనే విగ్రహాలు ప్రతిష్ఠించాలి. ఉత్సవాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలి. లైసెన్స్‌లు తీసుకున్న వలంటీర్లదే పూర్తి జవాబుదారీతనం. విగ్రహాల వద్ద విధిగా ఎలక్ట్రీషియన్‌ను నియమించుకోవాలి. విద్యుత్ కనెక్షన్‌ను లీగల్‌గా తీసుకోవాలి, రాత్రి సమయంలో వినాయక మండపాల వద్ద కాపాలా ఏర్పాటు చేసుకోవాలి. నిమజ్జన సమయంలో మైనర్‌లను తీసుకుని వెళ్ల కూడదు. ఊరేగింపు సమయంలో రంగులు చల్లరాదు, కర్రలు, లాఠీలు, ఇతర మారణాయుధాలు చేతపట్టరాదు. నిమజ్జన సమయంలో భక్తి పూర్వకంగా, సామరస్యంగా వ్యవహరించాలి. మత సామరస్యతను పాటించండి. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలుంటాయి. పట్టణంలో అన్ని చోట సీసీ కెమెరాలున్నాయి. తప్పు చేస్తే వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం.

– శివ రామకృష్ణారెడ్డి, సీఐ, కనిగిరి

అగ్నిమాపక శాఖ అనుమతి తీసుకోవాలి:



గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అగ్నిమాపక శాఖ అనుమతి తీసుకోవాలి. విగ్రహాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రదేశం అగ్నిమాపక శాఖకు తెలియచేయాలి. విద్యుత్ పరివర్తకాలకు, విద్యుత్ స్తంభాలకు దూరంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక వాహనం వచ్చేందుకు వీలుగా దారిని వదలాలి. ప్రతి మండపం వద్ద రెండు డ్రమ్ముల వాటర్ ఒక ట్రక్కు ఇసుకను విధిగా ఉంచాలి. విద్యుత్ ప్రభలను ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక అధికారులు సూచించిన జాగ్రత్తలు పాటించాలి.

– రేగలగడ్డ రామకృష్ణ, ఫైర్ అధికారి, కనిగిరి

ఘనంగా విశ్వకర్మ జయంతి



టంగుటూరులో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వరికూటి అశోక్‌బాబు



రామాయపట్నం పోర్టులో హోమంలో పాల్గొని పూజలు చేస్తున్న శేషుకుమార్



కలశపూజలో పాల్గొన్న భక్తులు

గుడ్లూరు: మండలంలోని మొండివారిపాలెం గ్రామం వద్ద నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టులో విశ్వకర్మ భగవానుడి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోర్టు జనరల్ ప్రాజెక్టు మేనేజరు శేషుకుమార్, మెకానికల్ డిపార్టుమెంట్ ఏజీఎం ప్రతాప్‌చౌదరిలు విశ్వకర్మ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. శేషుకుమార్ మాట్లాడుతూ చేతివృత్తులు చేసేవారు విశ్వకర్మ భగవానుడిని ఆరాధ్యదైవంగా కొలుస్తారన్నారు. మెకానికల్ డిపార్టమెంట్‌లో పని చేసే సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఎర్రాప్రగడ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి దేవతల శిల్పి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.

పామూరు: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని స్థానిక విరాట్ నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో గాయత్రీ సమేత విశ్మకర్మ మహాయజ్ఞం ఆదివారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు వేదమంత్రాలతో పుణ్యాహవచనం, గణపతిపూజ, గాయత్రీ సమేత విశ్వకర్మ ఉత్సవ విగ్రహ మూర్తులకు అభిషేకంతో పాటు కలశపూజ, మహాయజ్ఞం, కలశ తీర్థం, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గాయత్రీ విశ్మకర్మ పతాకావిష్కరణను వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముండ్లపాటి దొరసానయ్యాచారి, మండల విశ్వబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు సొస్సం నాగేంద్రాచారి, బాలబ్రహ్మాచారి, వినుకొండ సురేష్‌బాబు, వెంకటాచారి, పి.రాజా, చంద్రశేఖర్, వి.బాలబ్రహ్మాచారి, సుభేష్, మణి, భక్తులు పాల్గొన్నారు.

మర్రిపూడిలో...

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విరాజ్ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, విశ్వకర్మస్తోత్ర పారాయణం, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవితధారణ, హోమయజ్ఞం, యజ్ఞమహోత్సవం, పూర్ణాహుతి పూజలను యాగ్నీకులు విశ్వరూపచారి వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పంచామృతాలు స్వీకరించారు. అనంతరం విరాట్ విశ్వకర్మ భగవాన్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాటి వీరనారాయణ, ఈదుమూడి కోటేశ్వరరావు, పీ బ్రహ్మయ్య, ఈ సతీష్, పీ సుబ్బారావు, కృష్ణాచారి, బాలయ్య, ఈ రవిప్రసాదు, మీ శ్యామల, మల్లికార్జున, ఈ ప్రసాదు, ఎస్.దత్తాత్రేయ, బాలసుబ్రహ్మణ్యం, ఈ నర్సింహాచారి, గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులో విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. హోమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరిపారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు భీమయ్య, గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు పాల్గొన్నారు.

జరుగుమల్లి: విశ్వకర్మ జయంతి సందర్భంగా స్థానిక రామాలయంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఒంగోలు విశ్వబ్రాహ్మణ సంఘ కార్యదర్శి ఫణిదపు సుధాకర్, జరుగుమల్లి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి పోతులూరయ్యాచారి, ఏల్చూరి హేమంత్, ఒంగోలు నగర విశ్వబ్రాహ్మణ సంఘ యూత్ నాయకుడు అనంత మాధవ స్వామి, చిరిపోతుల ఆంజనేయులు, కె.సుబ్రహ్మణ్యం, మండలంలోని కె.బిట్రగుంట, నందనవనం, దావగూడూరు, చిరికూరపాడు గ్రామ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టంగుటూరులో...

టంగుటూరు: విశ్వకర్మ జయంతి వేడుకలను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్వకర్మ నేపథ్యం గురించి ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పెద్దకల్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ చేతుల మీదగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మల్లవరపు రాఘవరెడ్డి, ఆలకూరపాడు సర్పంచ్ బిల్లా ఝాన్సీరాణి, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, కోటు, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సూదనగుంట వెంకటస్వామి, బెజవాడ సురేష్, కొమ్ము కోటేశ్వరరావు, దుగ్గిరాల పేర్రాజు, కసుకుర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి శివాజీ, బద్దిపూడి సురేష్, నల్లమలపు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: పట్టణంలోని కనిగిరి రోడ్డులో విశ్వకర్మ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి ప్రవేశపెట్టిన విశ్వకర్మయోజన పథకం ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18 రకాల చేతి వృత్తుల వారు పాల్గొని తమ పేర్లను పథకం లబ్దిదారులుగా ఆన్‌లైన్ చేసుకున్నారు. అల్లూరి హరిబాబు, అల్లూరి చంద్రశేఖర్, శివరామయ్య, తిరువళ్లూరి కృష్ణమాచారి, భారతి, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, మన్నేపల్లి ప్రసాద్, చుండి భూషయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గుండ్లసముద్రంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఉలవపాడులో విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ పూజలో పాల్గొన్న సంఘ నాయకులు

కొండపిలో 34 వినాయక విగ్రహాల ఏర్పాటు

సింగరాయకొండ: కొండపి మండలంలోని గ్రామాల్లో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 34 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై రమణయ్య తెలిపారు. వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరని, అనుమతులు లేకుండా ఎవరూ విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా గంగాభవానీ తిరునాళ్ల



గంగాభవానీ పూజల్లో పాల్గొన్న నాయకులు, భక్తులు

పామూరు: మండలంలోని వగ్గంపల్లెలో గంగామాత ఆలయంలో గంగాభవానీ తిరునాళ్ల, ఆలయ 14వ వార్షిక వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గంగా భవానీ మూలవిగ్రహమూర్తికి పంచామృతాలతో పాటు పసుపు, కుంకుమ, విభూతితో అభిషేకం నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి పంచలోహ ఉత్సవమూర్తికి కుంకుమాభిషేకం నిర్వహించారు. పూజల్లో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, షేక్.సుమీర్, బొట్టు శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొనగా దేవస్థాన కమిటీ వారిని ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన మండపంలో భక్తులకు అన్నదానం నిర్వహించగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ గఫార్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ జాజుల మాల్యాద్రి, మల్లేశ్వరి, గురవమ్మ, నాయకులు డేగా జాలయ్య, సీతనబోయిన రవి, జంబు క్రిష్ణ, జయరాములు, డేగా నాగరాజు, నాగేశ్వరరావు, ఒంటేల నాగార్జున, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కనిగిరి రూరల్: ఉపాధ్యాయుల సంక్షేమమే యూటీఎఫ్ లక్ష్యంగా ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ డివిజన్ స్థాయి వైద్య విజ్ఞానిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్కే ఖాజా రంతుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులపై ఉపాధ్యాయులు చైతన్య వంతులు కావాలన్నారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేపడుతున్న పథకాలను తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, రాచపుడి శ్రీనివాసులు, జి.సంజీవి, రాజాల కొండారెడ్డి, డీఆర్ ప్రసాద్, డీవీ సుబ్బారావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరారెడ్డి, ఎస్ రవీ, యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా మీగడ వెంకటేశ్వరరెడ్డి, నల్లపు రామచంద్రారెడ్డి, మూలె రమణారెడ్డి, బత్తుల రుషేంద్రకుమార్, ఎస్కే ఖాజా హుస్సేన్, కె.కృష్ణ మూర్తి, రాజసులోచన, జి.ఉమామహేశ్వరి, ఎస్ ఉమామహేశ్వరి, యూటీఎఫ్ ఆరు మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం రెడ్డి కార్పొరేషన్ చెర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి ఆర్థిక సహకారంతో టీచర్లకు బ్యాగులను అందచేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

టంగుటూరు: ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్ 14, విభాగాల్లో టంగుటూరు భాష్యం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న తన్నీరు హాసిని 46 కేజీల కేటగిరిలో, అండర్ 17 విభాగంలో ఏ.సాయి రాకేష్ 62 కేజీల కేటగిరీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21న కృష్ణా జిల్లా మున్నా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా, పీడీ సుబ్రహ్మణ్యం, జిల్లా రెజ్లింగ్ అధ్యక్షుడు హాజీరా బేగం అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కేజీబీవీ విద్యార్థినులు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీఈటీ

కందుకూరు రూరల్: కందుకూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికల్లో కేజీబీవీ విద్యార్థినులు పలు క్రీడల్లో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.స్వాతి తెలిపారు. అండర్–17విభాగంలో కబడ్డీకి ఎన్.అంజలి, కె.మానస, వై.శరణ్య, ఖోఖోకు డి.శ్రీవాణి, జి.జస్సిక, ఎం.హేమలత, జి.కుసుమరాయ్, బి.అక్షయ, కె.శరణ్య, ఎం.చిన్నారి, ఎస్.హసీని, ఏ.చరిత, త్రోబాల్‌కి ఎస్.అంజలి, జి.జస్సిక, యోగాకు జి.జస్సికలు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా అండర్–14లో కబడ్డీకి జె.రేష్మ, పి.వాసవి, ఖోఖోకి జె.ఆరంజ్‌మాల్యా, టి.అమృత, పి.శశికళ, త్రోబాల్‌కి ఎం.నాగలక్ష్మి, ఎం.హేమలత, వి.అక్షయలు ఎంపికయ్యారు. వీరిలో కందుకూరు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు ప్రిన్సిపాల్ అభినందించారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు

గుడ్లూరు: సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు బొద్దుకూరు నారాయణరావు తెలిపారు. నెల్లూరు మోడరల్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పరీక్షలు చేసి 60 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించి వారికి ఫౌండేషన్ తరపున ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ శ్రీను, పీఆర్ఓ శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు రాజేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భారీగా క్యూ కట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. అభిషేకాల అనంతరం దేవాలయ అర్చకులు శ్రీనివాసశర్మ పోలేరమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, దేవస్థానం చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.